క్లుప్తంగా

మావుళ్లమ్మ సన్నిధిలో...



శ్రీమావుళ్లమ్మ వారి సన్నిధిలో రాష్ట్ర సహకార శాఖ అదనపు రిజిస్ట్రార్ గౌరీ శంకర్

భీమవరం (ప్రకాశంచౌక్) : రాష్ట్ర సహకార శాఖ అదనపు రిజిస్ట్రార్ గౌరీ శంకర్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం శ్రీ మావుళ్ళమ్మ అమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీ ఉమా సోమేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట భీమవరం డివిజనల్ సహకార అధికారి రామ దాసు, ఉద్యోగుల యూనియన్ నాయకుడు నందమూరి సుబ్బారావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై కళాజాత

భీమవరం (ప్రకాశంచౌక్) : ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పలు చోట్ల కళాజాత ప్రదర్శించారు. ప్రచార కార్యక్రమాలలో భాగంగా ప్రజలకు ప్లాస్టిక్ కవర్ల వాడకం వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. మిషన్ లైఫ్‌లో భాగంగా మన జీవన విధానాన్ని మెరుగుపరుచుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్లోబల్ స్టూడెంట్ ఎవర్నెస్ ఆర్గనైజేషన్ వారి కళాకారుల బృందం చేత భీమవరంలోని పలు ప్రదేశాల్లో కళాజాతా ప్రదర్శించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

8 నుంచి సువార్త సభలు

ఉండి: ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్‌లో ఆధ్యాత్మిక ఉజ్జీవ రక్షణ సువార్త సభలను నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యవర్గ సభ్యులు మంగళవారం తెలిపారు. పేరిష్ పాస్టర్ రెవరెండ్ వీ నెహ్రూ ఈ సభలను ప్రారంభిస్తారని వాక్యోపదేశకులుగా బ్రదర్ కిరణ్‌పాల్(గుడివాడ), పాస్టర్ పీ సునీల్‌కుమార్(వరంగల్) నుంచి హాజరువుతున్నట్లు తెలిపారు. సంఘ కాపరి పీ కరుణాకర్‌రావు, స్థానిక సంఘ పెద్దలు, పీసీసీ సభ్యులు, కోశాధికారి, కార్యదర్శి ఆధ్వర్యంలో సభల నిర్వహణ చేస్తున్నట్లు తెలిపారు. దేవుని బిడ్డలు పెద్ద ఎత్తున ఈ సభలకు హాజరు కావాలని కోరుతున్నట్లు కార్యనిర్వాహక సభ్యులు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు నమోదు చేయాలి



బీఎల్‌వో సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఫాజిల్

నరసాపురం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని తహసీల్దార్ ఫాజిల్ అన్నారు. నరసాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన బూత్‌లెవెల్ అధికారుల (బీఎల్‌వో) సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 1వ తేదీ 2024 నాటికి 18 ఏళ్ల వయస్సు నిండే ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. ప్రత్యేక కార్యక్రమం ద్వారా అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. నూతనంగా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారు. ఫారం నం.6 వినియోగించాలని, ఓటు తొలగింపునకు నం.7 ఫారాన్ని, కార్డులో మార్పులు, చేర్పులు, తప్పొప్పుల సవరణకు నం.8 ఫారాన్ని వినియోగించాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ నాగదేవి, మున్సిఫల్ టీపీవో, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

చెరువులో పూడిక తీత పనులు

పెనుగొండ: ఉపాధి హామీ పనులతో గ్రామాల అభివృద్ధి దోహదపడతాయని, చేతి వృత్తిదారులకు ఎంతోగానో ఉపకరిస్తాయని సిద్ధాంతం సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి) అన్నారు. సిద్ధాంతంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన రజకుల చెరువు పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. చెరువులు పూడిక తీతతో ఉపాధికి అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సిద్ధాంతం రజక సంఘ పెద్దలు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరిస్తాం

పెంటపాడు: తాము చదువుకొన్న కళాశాల ఉన్నతంగా తీర్చిదిద్దబడాలని ఆ పూర్వ విద్యార్థులు గుర్తించారు. అనుకొందే తడవుగా ఇటీవల ఆత్మీయ సమ్మేళనం చేసుకొన్న డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1975–78 బీకాం రాయల్ విద్యార్థులు కళాశాల బాగోగుల గురించి ఆరా తీసారు. ప్రిన్సిపాల్ రూంలో ఏసీ లేకపోవడం గమనించారు. అప్పటికప్పుడు బ్లూస్టార్ కంపెనీకి చెందిన 2 టన్స్ 5 స్టార్ ఏసీని బహూకరించి తమ గురుభక్తిని చాటుకొన్నారు. మండలి హనుమంతరావు దంపతులు ఏసీని ప్రిన్సిపాల్ ఎం. శ్యాంబాబుకు అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులైన జంద్యాల నాగేశ్వరరావు, కర్రి బాస్కరరావు జానకిరామ్, రవి ప్రసాద్‌లు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి సహకరిస్తామన్నారు. మండలి హనుమంతరావు దంపతులను కళాశాల తరపున ప్రిన్సిపాల్ శ్యాంబాబు ఘనంగా సన్మానించారు. కళాశాల అధ్యాపకులు విక్టర్ ప్రేమ్ సాగర్, వైస్ ప్రిన్సిపాల్ బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



ఉండిలో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: గ్రామాల పూర్తిస్థాయి అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఉండి గ్రామంలోని భవానిపేటలో మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న సీసీ డ్రెయిన్, పంచాయతీ సహాయ నిధులు రూ.5 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు గ్రామ సర్పంచ్ కమతం సౌజన్య, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ ఆధ్వర్యంలో పీవీఎల్ మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఆయన తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా పక్కా డ్రెయిన్స్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఇప్పటికే మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో డ్రెయిన్ నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఏ గ్రామంలో అయితే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పూర్తయ్యిందో ఆ గ్రామ సచివాలయ పరిధిలోని సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసిందన్నారు. వీటితో ఆయా గ్రామాల్లోని సమస్యలను వెనువెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీరోడ్లు నిర్మాణం చేసేందుకు కూడా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ మహంకాళి, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, యేడిద వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, రణస్తుల మహంకాళి, కరిమెరక శివనాగరాజు, శేషాద్రి శ్రీను, జంపా నాగేశ్వరరావు, బొచ్చా అచ్చారావు, శ్రీనివాసరాజు, రవి, ఆర్‌కే తదితరులు పాల్గొన్నారు.

చంద్ర పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : పీడిత ప్రజల అభ్యున్నతి, సామాజిక అసమానతలు లేని సమాజం కోసం, దోపిడీ వ్యవస్థ అంతానికి తుది శ్వాస వీడేవరకు పోరాడిన యోధుడు చంద్ర రాజేశ్వరరావు అని ఆయన ఆశయాల సాధనకు అందరూ పునరంకితం కావాలని సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో కమ్యూనిస్టు అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు జయంతిని సీపీఐ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. చంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోనాల మాట్లాడుతూ సంపన్న కుటుంబంలో పుట్టి బెనారస్ యూనివర్సిటీలో వైద్య విద్యనభ్యసిస్తూ సమసమాజ నిర్మాణం కోసం, సామాజిక న్యాయం కోసం తన వైద్య విద్యను సైతం విడనాడి కమ్యూనిస్టు ఉద్యమాల్లో భాగం పంచుకుని పోరాడిన యోధుడు చంద్ర రాజేశ్వరరావు అని కొనియాడారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా 28 ఏళ్లు అంకితభావంతో పనిచేసి పార్టీని అగ్రభాగాన నిలిపారని ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన చేసిన భూ పోరాటాల ఫలితంగానే భూసంస్కరణల చట్టాలొచ్చాయని, లక్షలాది ఎకరాలు పేదలకు దక్కాయని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, జిల్లా సమితి సభ్యుడు మల్లుల శ్రీనివాసరావు, వైవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ సేవలు అభినందనీయం



పాలకోడేరులో మొక్కలు నాటుతున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

పాలకోడేరు: వాకర్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని డీఎన్ఆర్ కళాశాల ప్రొఫెసర్ గాదిరాజు కృష్ణంరాజు అన్నారు. మండల కేంద్రమైన పాలకోడేరులోని గోస్తనీ నది గట్టును ఉన్న మహాలక్ష్మి హేచరీస్ వద్ద మంగళవారం పాలకోడేరు వాకర్స్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు భీమవరం వాకర్ సభ్యులు ఆరోగ్యమే మహాభాగ్యం అనే కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ నాయకులు కృష్ణంరాజు గుంటూరు రామరాజు, సుబ్బారెడ్డి తదితరులు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ఏదో ఇబ్బందితో బాధపడుతున్నారన్నారు. ఈ అనారోగ్య లక్షణాల నుంచి విముక్తి పొందాలంటే పచ్చని చెట్ల మధ్య ప్రకృతి గాలిని ఆస్వాదిస్తూ నడక నడవడం ద్వారానే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. ఇలా ప్రతి ఒక్కరూ ప్రతిరోజు ఉదయం సాయంత్రం నడక ద్వారా నవ్వుతూ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని ఉద్దేశంతోనే వాకర్స్ అసోసియేషన్ నీ ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా గోస్తని నది గట్టున మొక్కలు నాటారు. ఇంటర్నేషనల్ వాకర్ అసోసియేషన్ అధ్యక్షులైన సుబ్బారెడ్డిని సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఓలేటి శ్రీనివాస్, కార్మూరు సత్యనారాయణ, బి శ్రీనివాస్, పల్లి వెంకన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం, ఆరోగ్యం



గొల్లలకోడేరులో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఘన జీవామృతాన్ని తయారు చేస్తున్న సిబ్బంది

పాలకోడేరు: ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా ఆదాయంతో పాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ అధికారులు స్వామి, వీరేంద్ర అన్నారు. గొల్లలకోడేరులోని సీతారాంపురంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘన జీవామృతాన్ని తయారు చేసే విధానాన్ని స్థానిక రైతులకు వివరించారు. ప్రస్తుత రోజుల్లో సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా అధిక ఖర్చులతో పాటు అనారోగ్యం కూడా కొని తెచ్చుకుంటున్నామని సూచించారు. పూర్వీకులు గతంలో ఆరోగ్యకరమైన పంటలను పండించే వారన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని తద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు ఎం.వెంకటలక్ష్మి, ఎం.ధనలక్ష్మి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

సాక్షి, భీమవరం : టూటౌన్‌కు చెందిన యువతి సోమవారం నుంచి కనిపించడం లేదంటూ ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఏఎస్సై సూర్యనారాయణ తెలిపారు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బ్యూటీ పార్లర్‌కు వెళుతున్నాని చెప్పి వెళ్లిన యువతి తిరిగి రాకపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వాహనాల సీజ్



అక్రమంగా కంకర రవాణా చేస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్న సబ్ కలెక్టరు సూర్యతేజ

పెనుగొండ: మైనింగ్ బిల్లులు, వే బిల్లులు లేకుండా అక్రమంగా కంకరను రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేయడానికి నర్సాపురం సబ్ కలెక్టరు సూర్యతేజ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం పెనుగొండ కళాశాల కూడలి వద్ద మైనింగ్ అధికారి బి శివలీలారాణి, ఎం బాబూరావుతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేసారు. గౌరీపట్నం నుంచి మల్కిపురం వెళ్తున్న ఆరు వాహనాలను తనిఖీ చేయగా ఎటువంటి పత్రాలు లేవని గుర్తించారు. వీటిలో రెండు వాహనాలకు రూ.20వేలు జరిమానా విధించారు. మిగిలిన నలుగు వాహన డ్రైవర్లు వాహనాలు విడిచి వెళ్లి పోవడంతో వాటిని పెనుగొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎస్ గురుమూర్తి రెడ్డి, సీఐ జీవీవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డయాలసిస్ రోగికి పింఛన్ అందజేత



కాంభొట్లపాలెంలో మంద జయలక్ష్మికి రూ.10 వేలు పింఛన్ అందజేస్తున్న సచివాలయ కన్వీనర్లు

యలమంచిలి: మండలంలోని కాంభొట్లపాలెం పంచాయతీ అంబేడ్కర్ నగర్‌కు చెందిన మంద జయలక్ష్మి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఆరోగ్యశ్రీలో వైద్యం పూర్తి ఉచితంగా అందుతున్నా జీవనోపాధికి కష్టంగా ఉందని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులకు జయలక్ష్మి చెప్పుకుంది. దీంతో వారంతా ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్‌ను కలసి ఆమె సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన కవురు శ్రీనివాస్ అధికారులతో మాట్లాడి జయలక్ష్మికి రూ.10వేలు పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన సిఫారసుతో జయలక్ష్మికి ఈ నెల నూతనంగా రూ.10 వేలు పింఛన్ మంజూరైంది. ఆ పింఛన్ నగదును మంగళవారం సచివాలయ కన్వీనర్లు గృహసారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులు కలిసి జయలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి యలమంచిలి మండల చైర్మన్, బూరుగుపల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్ అనిశెట్టి ధర్మారావు, వైఎస్సార్ సీపీ కాంభొట్ల పాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడు శీలం వీరబాబు వైఎస్సార్ సీపీ నాయకులు మంద హరికుమార్, అనిశెట్టి గంగన్న, అంతర్వేది సీతారామయ్య, మంద పెద్దిరాజు, గృహ సారథి మంద గోపమ్మ, వలంటీర్ చిల్లే స్పందన పాల్గొన్నారు.

వ్యవసాయ భూముల రీసర్వే



పెనుమదంలో డ్రోన్ సర్వేను పర్యవేక్షిస్తున్న జెడ్పీ ఫ్లోర్‌లీడర్ గుంటూరి పెద్దిరాజు

పోడూరు: జగనన్న శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా డ్రోన్ సర్వేతో వ్యవసాయ భూముల రీసర్వే చేయడం ద్వారా రైతుల సమస్యలకు సత్వర పరిష్కారం దొరుకుతుందని జెడ్పీఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు అన్నారు. పెనుమదంలో మంగళవారం డ్రోన్ ద్వారా వ్యవసాయ భూముల రీసర్వేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు మాట్లాడుతూ డ్రోన్‌ల ద్వారా రీసర్వే ప్రక్రియతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఆయనతో పాటు ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, తహశీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, ఆర్ఐ కె.రాంబాబు రీసర్వే ప్రక్రియను పర్యవేక్షించారు. రెండు రోజుల్లో మండలవ్యాప్తంగా ఈ ప్రక్రియ పూర్తవుతుందని తహసీల్దార్ విలేకర్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసాపురం డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్ కృష్ణకిషోర్, సొసైటీ చైర్మన్ కొత్రపాటి వీరాస్వామి, సర్పంచ్ తానేటి బాబూరావు, ఉపసర్పంచ్ పితాని చిన్న, వీఆర్వోలు మెహర్‌బాబా, శ్రీనివాసవర్మ, మండల సర్వేయర్ కె.సత్యనారాయణమూర్తి, సర్వేయర్లు మారుతి, చిరంజీవి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గెద్దాడ ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు యువతరం ఉద్యమంలోకి రావాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్సీ వర్గీకరణతోనే విద్య, ఉద్యోగ రంగాల్లో న్యాయమైన వాటా దక్కుతుందని ఎమ్మార్పీస్ మండల కోకన్వీనర్ ఇల్లెందుల వీర్రాజు అన్నారు. మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ సమావేశం సోమవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం విద్యార్థులు, యువతరం ఉద్యమంలోకి రావాలని పిలుపునిచ్చారు. మంద కృష్ణ మాదిగ సమక్షంలో బహిరంగ సభ నిర్వహించనున్నామని, మాదిగలంతా సన్నద్ధం కావాలన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కండెల్లి కాంతారావు, కార్యదర్శిగా చిగురుపల్లి గంగరాజు, ఉపాధ్యక్షుడిగా చంద్రయ్య, కార్యదర్శిగా దర్శిపాము ఏసురత్నం ఎన్నికయ్యారు.

నూరు శాతం వసూళ్లలో కలవపూడి సొసైటీ



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ ప్రసాద్ రాజు, సీఈఓ మణి

కాళ్ల: కలవపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో 2022–23 సంవత్సరానికి సంబంధించి రైతుల నుంచి రావాల్సిన బకాయిలను నూరు శాతం వసూలు చేసినట్లు కలవపూడి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ పెన్మెత్స దుర్గాప్రసాదరాజు, సీఈవో కనుమూరి మణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సంఘ సభ్యుల నుంచి రావాల్సిన మొత్తం సుమారు రూ.6.40 కోట్లు వసూలు చేసి తిరిగి మరల సభ్యులకు రుణాలను మంజూరు చేసినట్లు వివరించారు. గత 13 ఏళ్లుగా జిల్లాలో అన్ని సహకార సంఘాల కంటే ముందుగా రికవరీ చేసి ఆదర్శ సంఘంగా నిలుస్తుందన్నారు. దీనికి సహకరించిన జిల్లా సహకార సంఘ సిబ్బందికి, రైతులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఏబీఎస్‌వీకేలో గుండె వైద్య సేవలు

భీమవరం (ప్రకాశంచౌక్) : ఔషధాలతోపాటు సమతుల్య పోషక ఆహారం, అవసరమైన మేరకు శారీరక శ్రమ (వ్యాయామం)తో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని గుండె వైద్య నిపుణులు డాక్టర్ పి.చంద్రశేఖర్ వర్మ అన్నారు. మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో మంగళవారం రోగులను పరీక్షించి వారికి గుండె వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఈసీజీ, 2డి ఎకో పరీక్షలను నిర్వహించారు. శ్రీ లక్ష్మి గాయత్రి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (హైదరాబాద్), వసుధ ఫౌండేషన్‌ల సహకారంతో ఏబీఎస్‌వీకేలో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు కోరారు. ప్రతిరోజు సాయంత్రం సాధారణ వ్యాధులు, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు ప్రముఖ వైద్యులు వైద్యసేవలు అందిస్తారన్నారు. అలాగే ప్రతి మంగళవారం ఉదయం గుండె వైద్య నిపుణులు తమ సేవలను ఉచితంగా అందిస్తారని ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్లూయిజ్‌లకు మరమ్మతులు చేపట్టండి



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం : నియోజకవర్గ పరిధిలో ఉన్న స్లూయిజ్‌లను పరిశీలించి వాటికి మరమ్మతులు అవసరమైతే వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా పెదగరువు వద్ద ఉన్న స్లూయిజ్‌ను, శృంగవృక్షం వద్ద ఉన్న స్లూయిజ్‌లకు వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు. సార్వా పంటకు సాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఈ కె.శ్రీనివాస్, ఏఈ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్ : మండలంలోని తాడేరు విద్యుత్ ఉప కేంద్రం నుంచి పెదగరువు వెళ్లే ఉప కేంద్ర పరిధిలో బుధవారం 33 కేవీ హైటెన్షన్ వైర్లపై చెట్లు, కొమ్మలు వార్షిక మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ మంగళవారం తెలిపారు. తాడేరు, యమునాపల్లి, కొత్రపాడు, బేతపూడి, కరుకువాడ పెదగరువు, చినగరువు, రాజుల గరువు, వెంప, శ్రీరామపురం, తుందుర్రు, జొన్నలగరువు, దూసనపూడి, మత్స్యపురి పాలెం, కమతాలపల్లి, బాలేపల్లి గ్రామాలతో పాటు తుందుర్రులోని గోదావరి మెగా ఆక్వా ఫుడ్‌పార్కుకు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, రాయలం విద్యుత్ సబ్ స్టేషన్‌పరిధిలో గొర్లమూడి, కొమరాడ, అనాకోడేరు, తుమ్మగొప్పి, ఈలంపూడి, గ్రామాలతోపాటు కొమరాడలోని ఇండస్ట్రీయల్ లైన్లకు, ఆక్వా చెరువులకు ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఠారెత్తిస్తున్న ఎండలు



నిర్మానుష్యంగా జాతీయ రహదారి

ఆకివీడు: రోహిణీ కార్తెలో రోళ్లు పగులుతాయ్ అంటే ఎండ తీవ్రత ఎంత ఉంటుందో మన పెద్దలు ఆనాడే చెప్పారు. అదే రీతిలో రోహిణీ కార్తె ముగింపు రోజుల్లో రోళ్లు పగిలే విధంగా ఎండలు కాస్తున్నాయి. గత వారం రోజులుగా రోజు రోజుకూ ఉష్ణోగ్రత పెరిగిపోతుంది. అత్యధికంగా 39 డిగ్రీలుండే ఉష్ణోగ్రత గత రెండు రోజుల నుండి 41, 42 డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరుకుని రోళ్లు పగిలే విధంగా ఎండలు కాస్తున్నాయి. ఉక్కపోత, ఎండ వేడికి యువకులు సహితం అల్లాడిపోతున్నారు. వృద్ధులు, పెద్దలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ప్రధాన సెంటర్లలోని దుకాణాల్ని ఉదయం 10 గంటలకే మూసివేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఉక్కబోత వాతావరణంలో విద్యుత్ శాఖ అప్పుడప్పుడూ ప్రజల బతుకులపై ఆడుకుంటుంది. లైన్లు తెగిపోయాయని, గ్రిడ్‌లో అధిక లోడుకు సరఫరా నిలిచిపోయిందని, స్థానికంగా ఉన్న సమస్యల్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ సరఫరా నిలిపివేయండంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

అతిసార నియంత్రణ పక్షోత్సవాల ర్యాలీ



పీహెచ్‌సీలో అతిసార నియంత్రణ పక్షోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాలకొల్లు అర్బన్: లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అతిసార నియంత్రణ పక్షోత్సవాల ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డా. నవ్యజీవన్ మాట్లాడుతూ బిడ్డకు పాలు ఇచ్చే సమయంలో తల్లి పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాల్లో అతిసార నియంత్రణపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ భవానీ ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి కె ప్రభాకర్, గుడాల హరిబాబు, పీహెచ్‌ఎన్ పి ఎలిజబెత్, సబ్‌యూనిట్ అధికారి ఎం రాజశేఖర్, ఫార్మసిస్ట్ పీవీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునీటి బోర్లు వేస్తే కఠిన చర్యలు

వీరవాసరం : ప్రభుత్వ అనుమతి లేకుండా ఉప్పునీటి బోర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మత్స్య శాఖ ఏడీ ఎల్ఎల్ఎన్ రాజు తెలిపారు. కొణితివాడలో అనధికారంగా నిర్వహిస్తున్న ఉప్పునీటి బోర్లను మంగళవారం ధ్వంసం చేశారు. కలెక్టర్ పి.ప్రశాంతి, మత్స్యశాఖ పైస్థాయి అధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో ఉప్పునీటి బోర్లను ధ్వంసం చేసినట్లు రాజు చెప్పారు. తహసీల్దార్ ఎం సుందరరాజు, ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ, జి.శ్రీనివాసరావు, రెవెన్యూ, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు ఎంపీడీవోగా బాబ్జిరాజు

మొగల్తూరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వంద్రు బాబ్జి రాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీరాజ్ శాఖలో విస్తరాణాధికారులుగా పనిచేస్తున్న వారికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. దీనిలో భాగంగానే అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మలికిపురం మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న బాబ్జి రాజుకు పదోన్నతి కల్పిస్తూ మొగల్తూరు మండలానికి బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా విధులు నిర్వహించిన డాక్టర్ ఆర్‌సీ ఆనంద్ కుమార్‌కు పదోన్నతి కల్పించి విజయవాడలోని పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన బాబ్జి రాజు అనంతరం మండలం పరిషత్ కార్యాలయంలోనే ఉన్న జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావును మర్యాదపూర్వకంగా కలిసారు.

యువతలో ఆధ్యాత్మిక భావన పెంపొందించాలి

పెనుగొండ: ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బ్రదర్ జిమ్మి తంగచ్చన్ అన్నారు. మంగళవారం పెనుగొండ మండలం సోమరాజు చెరువులో సియోను ప్రార్థన మందిరంలో బ్రదర్ తానేటి జోయల్ అధ్యక్షతన సంఘ కాపరులు, దైవ సేవకుల సదస్సు నిర్వహించారు. ప్రపంచంలో మానవత్వం నానాటికీ కొరవడుతోందన్నారు. యువత చెడు అలవాట్లకు దగ్గరవుతూ దైవ చింతన లేకుండా జీవనం సాగిస్తున్నారన్నారు. ఏసుక్రీస్తు ఆధ్యాత్మిక బోధనలను యువతకు తెలియజేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్ మోషే, టి యేసురత్నం పాల్గొన్నారు.